# పెట్టుబడికి పరేషాన్

- భారంగా మారిన సాగు
- పెరిగిన ఎరువుల ధరలు
- రైతన్నలపై అధిక ధరల ప్రభావం


ఎలిగేడు మండల కేంద్రంలోని వరి పొలం

ఎలిగేడు: అన్నదాతలకు పంటల సాగు భారమవుతోంది. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఎరువుల ధరలు చుక్కలనంటుతుండడంతో రైతులు సతమతమవుతున్నారు. ధరల పెరుగుదలతో పంటల సాగుకు ఖర్చులు అధికమవ్వడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని 12 గ్రామాల్లో 14800 ఎకరాల్లో వరి, పత్తి, ఆయిల్‌పామ్‌తో పాటు వివిధ పంటలను రైతులు సాగు చేశారు. మండలంలో దాదాపు 7వేల మంది రైతులు ఉండగా అందులో 3390 చిన్నకారు, 3100 పెద్ద రైతులు,480 మంది ఇతర రైతులు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. రోజు, రోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వీటికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో సాగు పెట్టుబడి మరితం భారమైంది.

**డీజిల్ ధరల ప్రభావం..**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటలసాగుపై ప్రభావం చూపుతోంది. దుక్కులు దున్నటం, పురుగు మందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తిస్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపుతో ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. దీంతో రైతులపై పెట్టుబడి భారం పెరిగింది. మరోవైపు ఎరువుల తయారీకి వినియోగించే ముడి సరుకు ధరలు పెరిగాయి. దీంతో 50 కిలలో బస్తాల ఎరువుల ధరను రూ.250 నుంచి రూ.500 పెంచినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులపై రాయితీలను తగ్గింపుతో ధరలు పెంచుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి 20 శాతం వరకు పెంచడంతో రైతులు దిగులు చెందుతున్నారు.

**ఎరువుల వినియోగం**

మండల వ్యాప్తంగా వానకాలం,యాసంగి పంటల సాగుకు రైతులు రియా 4623 మెట్రిక్‌టన్నులు, డీఏపీ 850మెట్రిక్‌టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 2460 మెట్రిక్ టన్నులు, ఎమ్‌ఓపి 690మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ ధర రూ.1350 ఉండగా 20–20–0–13 ఎరువు ధర రూ.1400 చేరగా 14–35–14 రూ.1500, 28–28–0 రూ.1500కు, ఎంవోపీ రూ. 1700 లకు చేరింది. పంటల సాగులో ఎరువుల కంటే పురుగు మందులకే ఎక్కువ పెట్టుబడి పెడుతున్నామని సన్న, చిన్నకారు రైతులు పేర్కొంటున్నారు.

### పెట్టుబడులు పెరిగాయి



పంటల సాగుకు పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం. డీజిల్ ధరలు పెరగటంతో ట్రాక్టర్ల కిరాయి పెంచారు. ప్రస్తుతం ఎకరం సాగు చేసేందుకు సుమారు రూ.6 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దీనికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి.పంటల సాగు చేయాలంటే భయంగా ఉంది.

– మారం కొమురయ్య రైతు, ధూళికట్ట,

### ఎరువులు కొనలేక పోతున్నాం



ఎరువుల ఖర్చు ఎక్కువవుతోంది. 50 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1500వరకు ఉంది. ఎరువులకే ఎకరాకు రూ.10వేల పెట్టుబడి వస్తోంది. పురుగు మందుల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ధరల పెరుగుదల కారణంగా పంట గిట్టుబాటు రావడం కష్టంగా మారింది.

–మండల తిరుపతి రైతు, లలితపల్లి (ఎలిగేడు)

## క్లుప్తంగా

### బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిందే


రిలేదీక్షా శిబిరంలో బీఎస్పీ నాయకులు

పెద్దపల్లిరూరల్: బీసీ జనగణన చేపట్టాలని, బీసీ రిజర్వేషన్లు 27 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు శేషాద్రి, మామిడి అనిల్, సవిత డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో 23 రోజులుగా రిలేదీక్షలు కొనసాగుతున్నాయని, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కూడా జరుగుతోందని వివరించారు. కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు దీక్ష శిబిరంలో కూర్చున్నారు. నాయకులు శారద, పర్శరాం, నరసయ్య, మహేశ్, రమేశ్, అఖిల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి


వినతిపత్రం అందిస్తున్న ప్రజాపంథా నేతలు

రామగుండం: మండల పరిధిలోని అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అంతర్గాం మండల నయాబ్ తహసీల్దార్ విజయ్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఒక్కరికీ ఇళ్లు కేటాయించలేదన్నారు. ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం పథకం వర్తింపజేస్తామని గద్దెనెక్కి హామీని విస్మరించి సొంత స్థలం ఉన్నవారికి మూడు లక్షలు ఇస్తామని మాట మార్చారన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా ప్రతినిధులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, జూపాక శ్రీనివాస్, తోకల రమేష్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి


కండువా కప్పుతున్న భానుప్రసాదరావు

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని శాసనమండలి చీఫ్ విప్ భానుప్రసాదరావు అన్నారు. పెద్దపల్లి మండలానికి చెందిన మండల సత్యనారాయణరెడ్డి, కల్వల శంకర్ శుక్రవారం హైదరాబాద్‌లో మండలి ఛీప్‌విప్ భానుప్రసాదరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ పుట్టిన రోజున పార్టీలో చేరడం ఆనందంగా ఉందని, పెద్దపల్లిలో పార్టీ బలోపేతానికి పాటు పడతామని సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

### గోలివాడ గోదావరి ఘాట్‌ను సందర్శించిన ఏసీపీ


ఘాట్‌ను పరిశీలిస్తున్న ఏసీపీ, సీఐలు

రామగుండం: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని గోలివాడ గోదావరి నదిలో వేలాదిమంది భక్తులు పుణ్యస్నానాలకు రానున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గోదావరి ఘాట్ పరిశీలిస్తూ పారిశుధ్య నిర్వహణ, భక్తులకు మౌలిక సదుపాయాలు తదితర ఏర్పాట్లపై సమీక్షించారు. గోదావరి ఘాట్‌ను సందర్శించిన ఏసీపీ గిరిప్రసాద్, సీఐ వై.చంద్రశేఖర్ గౌడ్, అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్, సర్పంచులు ధర్ని రాజేశ్, సతీశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### కళ్లద్దాలు పంపిణీ

సుల్తానాబాద్: ప్రభుత్వం అర్హులకు అందజేస్తున్న కంటిఅద్దాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీజ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆరో వార్డులో కంటివెలుగు ప్రారంభించారు. 18 ఏళ్ల పైబడిన వారు కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఊట్ల వరప్రదీప్, హెచ్‌ఈవో శ్రీనివాస్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గెలుపోటములు సమానంగా స్వీకరించాలి


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రూరల్ మండల స్థాయి సీఎం కేసీఆర్ కప్ 2023 క్రికెట్ మండల ఫైనల్ జట్టు విజేత గట్టెపల్లి నిలవగా వారికి బహుమతులను ప్రదానం చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆటలపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందన్నారు. ఉన్నత విద్యలో రిజర్వేషన్‌తో పాటు ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ కప్ 2023 ఫైనల్ మ్యాచ్ లో అల్లిపూర్ జట్టుపై గట్టేపల్లి జట్టు ఘన విజయం సాధించిందని వివరించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలోఎంపీపీ బాలాజీ రావు ,మున్సిపల్ చైర్మన్ ముత్యం సునీత, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు అనంత రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు పురం ప్రేమ్ చందర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

**గర్రెపల్లిలో కేసీఆర్ రోడ్డు ప్రారంభం**

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డుకు కేసీఆర్ పేరు నామకరణం చేయగా శుక్రవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. రోడ్డుకు కేసీఆర్ పేరును పెట్టడంతో సర్పంచ్ వీరగోని సుజాతను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, ఎంపీటీసీ పులి అనూష, ఉపసర్పంచ్ మధు, సింగిల్ విండో వైస్ చైర్మన్ దీకొండ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజల్లో విశ్వాసం నింపేందుకే బీజేపీ భరోసా


మాట్లాడుతున్న రాంనాథ్

మంథని: కల్వకుంట్ల చేతుల్లో బందీగా ఉన్న తెలంగాణ ప్రజల్లో విశ్వాసం నింపడానికే ప్రజా గోస–బీజేపీ భరోసా పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం బోయిన్‌పేట శక్తి కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ కుటుంబం అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, పట్టణ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు రామోజు లక్ష్మణ్, మహావాది రామన్న ఉన్నారు.

**గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి**

ధర్మారం: గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయటం కోసమే స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కాడే సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు యాళ్ల తిరుపతిరెడ్డి ఆధ్యక్షతన స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాడే సూర్యనారాయణ మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేసి రానున్న ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పత్తిపాక మాజీ సింగిల్‌విండో చైర్మన్ తాడ్వాయి రాంగోపాల్‌రెడ్డి, కమ్మరిఖాన్‌పేట సర్పంచ్ గుజ్జుల రమాదేవి వేణుగోపాల్‌రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షుడు గాగిరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## రైతులు ఉపాధి నిధులను వినియోగించుకోవాలి

పెద్దపల్లిరూరల్: రైతులు తమకు అవసరమైన పనులను ఉపాధి నిధులతో చేపట్టేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్ తెలిపారు.ఆసక్తి, అర్హతగల రైతులు తమ ఈజీఎస్ జాబ్‌కార్డు, మేకలు,పశువులు, కోళ్లు కలిగిఉన్నట్లు పశువైద్యాధికారితో పొందిన ధృవీకరణపత్రం, షెడ్ల నిర్మాణానికి సొంతభూమి ఉన్న పాసుపుస్తకం, పంచాయతీ తీర్మాన ప్రతులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో, ఈజీఎస్ ఏపీవోలను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కొంత మంది అక్రమంగా ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలున్నందునా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, బీఆర్‌ఎస్‌అధ్యక్షుడు తిరుపతిరావు, పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయవాద దంపతులకు నివాళి

మంథని: న్యాయవాద దంపతులు గట్టు వామన్‌రావు, నాగమణి దంపతులకు మంథనిలో న్యాయవాదులు నివాళులు అర్పించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం మాట తప్పిందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, రమణకుమార్‌రెడ్డి, న్యాయవాదులు ఉన్నారు.

రామగిరి: న్యాయవాద దంపతులను హత్య చేసిన స్థలంలో మంథని బార్ అసోసియేషన్ న్యాయవాదులు నివాళి అర్పించారు. న్యాయవాదులు బొట్ల ఆంజనేయులు, దండపల్లి విజయ్, శశిభూషణ్‌కాచే, ఆర్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: వామన్‌రావు దంపతుల హత్య దినాన్ని బ్లాక్‌డేగా ప్రకటించాలని న్యాయవాదులు శుక్రవారం సుల్తానాబాద్ కోర్టు ఎదుట నిరసనకు దిగారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు గౌడ్, కార్యదర్శి శ్యాంసుందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోదావరిఖని: వామన్‌రావు దంపతుల హత్యను నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రధాన చౌరస్తాలోని గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శైలజ, జవ్వాజి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోండి

మంథని: ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బగ్గని సుమలత తన కుమారుడు మనోజ్‌కుమార్ చెక్ డ్యాం గుంతలో పడి చనిపోయాడని, సంఘటన జరిగి రెండేళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్‌పై తీసుకోకపోవడం బాధాకరమని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ అన్నారు. శుక్రవారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్ ముందస్తు రక్షణ చర్యలు తీసుకోకపోవడం కారణంగానే సంఘటనకు కారణంగా అనుమానించారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

## ఆస్తిపన్ను వసూళ్లు పెంచాలి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో ఆస్తి పన్ను వసూళ్లను పెంచాలని రెవెన్యూ విభాగం అధికారులు, బిల్ కలెక్టర్లను మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఆస్తిపన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో బిల్ కలెక్టర్ ఇప్పటి వరకు చేసిన వసూలు చేసిన ఆస్తిపన్ను, వారికి కేటాయించిన లక్ష్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందుకోసం ప్రతీ బిల్‌కలెక్టర్ టార్గెట్ పెట్టుకొని, ప్రతీ రోజూ రూ.4లక్షలకు పైగా ఆస్తిపన్ను వసూలు చేయాలని ఆదేశించారు. మొండిబకాయిల వసూళ్లకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. సమావేశంలో ఆర్‌ఓ రాయలింగు, ఆర్‌ఐలు శంకర్‌రావు, కరుణాకర్,బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

## గ్రామ సమస్యలపై అడిషనల్ కలెక్టర్‌తో సమావేశం

గోదావరిఖని: సుందిళ్ల గ్రామప్రజలు జీడీకే–5 ఓసీపీ పనులు అడ్డుకున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణతో జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శుక్రవారం చర్చలు జరిపారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ఆర్డీవో వీరబ్రహ్మాచారి, సుందిళ్ల సర్పంచ్ దాసరి లక్ష్మి, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా శివ

రామగిరి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని బేగంపేటకు చెందిన దాసరి శివ ను ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెమిని గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు కతజ్ఞతలు తెలిపారు.

## వైభవంగా శివకల్యాణం


స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని విశ్వేశ్వరాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శివ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. కల్యాణమహోత్సవంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొని స్వామి వారలకు ఓడి బియ్యం, కట్నకానుకలు సమర్పించుకున్నారు. మహిళలు మంగళహారుతులు పాడారు. కార్యక్రమంలో సర్పంచు ఆరెల్లి సుజాత, ఎంపీటీసీ నిర్మల, ఉప సర్పంచు సుకేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, భక్తులు పాల్గొన్నారు.

## చెట్లు నరికి.. నిర్లక్ష్యంగా వదిలేసి

- బల్దియాలో కోనోకార్పస్ చెట్లకు ట్రిమ్మింగ్
- వేసవిలో చేపట్టడంపై వ్యక్తమవుతున్న విమర్శలు


కోనోకార్పస్ చెట్లను నరికి వదిలేసిన సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని డివైడర్ల మధ్యలో పెరిగిన కోనోకార్పస్ భారీ చెట్లను ట్రిమ్మింగ్ పేరుతో నరికిన సిబ్బంది, వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా రోడ్లపైనే ఎక్కడిక్కడ వదిలేశారు. కాగా, కోనోకార్పస్ చెట్లతో శ్వాసకోశ సమస్యలు వాటిల్లుతాయని, పర్యావరణానికి ఏలాంటి ఉపయోగపడని చెట్లను తొలగించాలని అనేక ఫిర్యాదులు వచ్చాయి. కానీ కోనోకార్పస్ చెట్లతో ఎలాంటి హానీ లేదని, పర్యావరణానికి పనికిరావని ఎక్కడ కూడా నిర్ధారణ కాలేదని ఇటీవల ‘సాక్షి’ నిర్వహించిన ‘ఫోన్‌ఇన్‌’ కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ ప్రకటించారు. అయితే స్ట్రీట్‌లైట్లు కనిపించకుండా భారీ ఎత్తులో పెరిగిన చెట్లను ట్రిమ్మింగ్ చేసి కొమ్మలను తొలగిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం ఓ కాంట్రాక్టర్ ప్రత్యేక సిబ్బందితో నగరంలోని పలు చోట్ల డివైడర్ల మధ్యలోని కోనోకార్పస్ చెట్ల కొమ్మను నరికివేశారు. అయితే నరికిన కొమ్మలను తొలగించకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా రోడ్లపైనే వదిలేసిపోయారు. రెండురోజులైనా నరికిన కొమ్మలను తొలగించకపోవడంపై నగర ప్రజలు మండిపడుతున్నారు. దీనికితోడు వర్షాకాలం, చలికాలంలో మాత్రమే చెట్లకు ట్రిమ్మింగ్ చేయించాల్సిన అధికారులు, వేసవి కాలం ఆరంభంలోనే చేట్టడం విమర్శలకు తావిస్తోంది.

## ఎంబీఏ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్


కేశోరాం సిమెంట్ కర్మాగారం వద్ద విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ ఎంబీఏ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్ లో భాగంగా శుక్రవారం కేశోరాం సిమెంట్ కర్మాగారాన్ని సందర్శించారు. కంపెనీలో సిమెంట్ ఉత్పత్తి, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై విద్యార్థుల్లో ఉన్న సందేహాలను కంపనీ ప్రతినిధులు నివృత్తి చేశారని హెచ్‌వోడీ ఉపేందర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు కంపెనీల్లో జరిగే కార్యకలాపాలను వివరించేందుకు విజ్ఞాన యాత్ర నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా కేశోరాం ప్రతినిధులకు కళాశాల చైర్మన్ నవీన్, డైరెక్టర్ నవత, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రభుత్వ ఆస్పత్రి సందర్శన**

సుల్తానాబాద్: ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సేవల గురించి విద్యార్థులకు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ రమాదేవి వివరించారు. శుక్రవారం వివేకానంద పాఠశాల విద్యార్థులు స్టడీ టూర్ లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకి ఆరోగ్యం పట్ల అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ భూసారపు రవీందర్, ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కేడీసీసీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

ఎలిగేడు: కేడీసీసీ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ రమేశ్ అన్నారు. శుక్రవారం ఎలిగేడు మండలం ధూళికట్టలో బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత –నగదు రహిత లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు నగదు రహిత లావాదేవీలు, డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కన్న అత్యధిక వడ్డీ రేట్లు ఇవ్వడంతోపాటు కొత్తగా యూపీఐ సౌకర్యంతో గూగుల్‌పే, ఫోన్‌పే సౌకర్యం, డైరీ, గొర్రెలు, ఉన్నత విద్యకోసం, వాహనాలకు లోన్ సౌకర్యంతోపాటు అన్ని రకాల లోన్ సౌకర్యంలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కావేరి, సింగిల్ విండో డైరెక్టర్లు పోల్సాని పుల్లారావు, బత్తిని లచ్చయ్య, కనుకయ్య ,ఎఫ్ఎల్‌సీ మోహన్‌రావు, ఎలిగేడు ,ధూళికట్ట సీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బాలాజీరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ లావణ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రేమ్‌చందర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జూలపల్లి: సీఎం కేసీఆర్ పేదల పాలిట దేవుడని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం జూలపల్లిలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు, శాస్త్రి నగర్ తో పాటు పలు కాలనీలలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి హాజరై కేకు కట్ చేసి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత,ఎంపీపీ బాలాజీ రావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆన్‌లైన్‌లో పోస్టల్ ఖాతా

పాలకుర్తి: వివిధ రకాల స్కీమ్‌లతో ప్రజలతో తపాలాశాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగానే ఇంటి వద్దనే ఉండి ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ ఖాతా ఓపెన్ చేసే వెసులుబాటును వినియోగదారులకు కల్పించనుంది. శుక్రవారం గోదావరిఖని సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతా తెరిచే వారు పోస్ట్ ఇన్ఫో అనే అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, అందులో చిరునామా ఇతర వివరాలు నమోదు చేసి ‘సర్వీస్ రిక్వెస్ట్’ రిజిస్టర్ చేసుకోవాలని సూచించా రు. ఈరిక్వెస్ట్ స్వీకరించిన వెంటనే పోస్టమాన్ ఇంటివద్దకే వచ్చి ఖాతా తెరిచేందుకు కావాల్సిన పత్రాలను వారి సమక్షంలో పూరించి అకౌంట్ ఓపెన్ చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకుని పోస్టల్ సేవలు పొందాలని పేర్కొన్నారు.

## గుంతల రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న మనోహర్‌రెడ్డి

ఓదెల: మండలంలోని కొలనూర్ నుంచి గోపరపల్లె మీదుగా సుల్తానాబాద్ వరకు గతుకుల రోడ్డుకు నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేశారు. రోడ్డు చెడిపోవడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న మనోహర్‌రెడ్డి సొంత ఖర్చులతో రోడ్డుపైన మొరం పోసి చదును చేయించారు. రోడ్డుకు మరమ్మతులు చేసినందుకుగాను వాహనదారులు, ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోపరపల్లె సర్పంచ్ కర్క మల్లారెడ్డి, మాజీఎంపీటీసీ దొడ్డె శంకర్, నాయకులు పాల్గొన్నారు.